క్లుప్తంగా

చిన్నారులకు అన్నప్రాసన



అమరచింత: పట్టణంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 6 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ రాధిక తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ అంగన్‌వాడీ పరిధిలో 6 నెలల వయస్సు దాటిన ప్రతి చిన్నారికి విధిగా అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకొచ్చి తల్లి సమక్షంలో అన్నప్రాసన చేశామన్నారు. గర్భిణి, ప్రసూతి మహిళలకు క్రమం తప్పకుండా పోషకాహారంతో పాటు ఆరోగ్య సలహాలు అందిస్తున్నామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి శిక్ష ఖరారు



అమరచింత: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురిని ఆత్మకూర్ సివిల్ కోర్టులో హాజర్చగా.. జడ్జి ఇద్దరికి చెరో రూ.వెయ్యి జరిమానా, మరో ముగ్గురికి ఆరు రోజుల సాధారణ జైలు శిక్షను విధించారని ఎస్ఐ సురేష్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లికి చెందిన నరసింహులు, పట్టణానికి చెందిన శేఖర్, పాంరెడ్డిపల్లికి చెందిన రత్నారెడ్డికి ఆరు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి, పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడిపి తమ ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు.

పాఠశాలకు టీవీ వితరణ



కొత్తకోట రూరల్: మన బడి మన బాధ్యత నినాదంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు విజన్ మేకర్స్ అసోసియేషన్ పేరుతో ఏర్పాటు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోధనకు సహకరించాలనే ఉద్దేశంతో శుక్రవారం మద్దిగట్ల ప్రాథమిక పాఠశాలకు 43 ఇంచుల ఎల్ఈడీ టీవీని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాణం విష్ణు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు, విజన్ మేకర్స్ అసోసియేషన్ సభ్యులు నరసింహారావు, శివరాజు, ఈశ్వర్, రాంబాబు, స్వామి, బంగారయ్య, భాస్కర్, శివ కుమార్ ఉన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ శివారులోని కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులకు తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వసంత ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 290 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాధులు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఓ సునీత, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ఏఎన్ఎం నాగలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: వ్యక్తి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్: రెండు బైకులు ఢీకొట్టుకోవడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని చిమనగుంటపల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దమందడి మండలంలోని చీకరుచెట్టుతండాకు చెందిన రమేష్ బైక్‌పై వస్తూ.. వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన నక్క బాలరాజు బైక్ గ్రామ సమీపంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌లపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

నాస్తిక మేళాకు తరలిన నాయకులు

అమరచింత: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూర్ జిల్లా నిడమర్రు చార్వాక ఆశ్రమంలో నిర్వహించే నాస్తిక మేళాకు జిల్లా నాస్తిక సమాజం నాయకులు శుక్రవారం తమ కుటుంబ సభ్యులతో కలిసి తరలివెళ్లారు. రెండు రోజుల పాటు జరిగే మేళాలో మేధావులు, భౌతికవాదులు, ప్రొఫెసర్లు, సాంకేతిక పరిజ్ఞానం మానవ పరిణామం, మూఢనమ్మకాలు అనే అంశాలపై సమగ్రంగా విశ్లేషిస్తారని జిల్లా అధ్యక్షుడు జాకబ్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్, రవి, రమేష్, కళానందం తదితరులు ఉన్నారు.



అభివృద్ధికి సహకరించండి

- ఇంటింటికీ తిరిగి పన్నుల వసూలు
- ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ శశిధర్

ఆత్మకూర్: పట్టణ అభివృద్ధికి స్థానికులు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని మున్సిపాలిటీ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. శుక్రవారం వార్డు అధికారులు, పురసిబ్బందితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి పన్నులను చెల్లించాలని ఇంటి యజమానులకు సూచించారు. మున్సిపాలిటీలో రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయని, పన్నులు చెల్లించడంలో చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం రూ.2.46 లక్షల పన్నుల బకాయిలు వసూలు అయ్యాయని కమిషనర్ తెలిపారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

వ్యాపార సముదాయాల్లో ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. ఈసందర్భంగా దుకాణ సముదాయాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి రూ.రెండువేల చొప్పున ఐదుగురు వ్యాపారస్తులకు జరిమానాలు విధించారు.

సమస్యలు తతెత్తకుండా చూడండి

మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు తీర్చడంలో ముందుండి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవిబాబు శుక్రవారం అమరచింతకు వచ్చిన ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్య వ్యవహారాలను కాపాడేందుకు నిత్యం ఫాగింగ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యూసుఫ్, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మహంకాళి విష్ణు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరిగారి విష్ణు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవరుచుకోవాలి



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ ఆనంద్

కొత్తకోట రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని కొత్తకోట ఎస్ఐ ఆనంద్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఖేల్ ఉత్సవ్ పేరుతో నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం ఎస్ఐ ఆనంద్ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడలు శరీర దృఢత్వానికి మానసికోల్లాసానికి, మనిషి ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్లు ఇనుప కండరాలు, ఉక్కు నరాలు వజ్ర సంకల్పం గల యువకులు దేశానికి తోడ్పడతారన్నారు. విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయిలో ఉండేందుకు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అర్జున్, పూర్వ జిల్లా కన్వీనర్ ఎం.అజయ్‌కుమార్, పవన్, ప్రధానాచార్యులు రాజేశ్వరి మాతాజీ, పీడీ మధు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి



పాన్‌గల్: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న మధుమేహ (షుగర్) నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్ఓ రామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మధుమేహ పరీక్షలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లు పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకుంటూ వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే ఆహారపు అలవాట్లల్లో మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 838 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాస తరగతులతో విద్యార్థులకు ప్రయోజనం



మోటివేషన్ క్లాసులకు వెళ్తున్న విద్యార్థుల వాహనాలను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

వీపనగండ్ల: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించనున్న విద్యార్థులకు మోటివేషన్ క్లాసుల వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జీహెచ్ఎం రాజవర్ధనాచారి అన్నారు. శుక్రవారం కల్వరాల ఉన్నత పాఠశాల నుంచి కొల్లాపూర్ పట్టణానికి వెళ్తున్న విద్యార్థులకు ఆయన తగు సూచనలు ఇచ్చారు. మోటివేషన్ క్లాసుల్లో ట్రైనర్ ఇచ్చే ప్రతి అంశాన్ని విద్యార్థులు గుర్తించుకోవాలని, తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, కళావతమ్మ, శ్రీనివాసులు, జితేందర్‌గౌడ్, బక్కన్న, మధుసూదన్ గుప్తా, గ్రామస్తులు వెంకటరాజయ్య, రమేష్, ఆంజనేయులు, స్వామి, అత్తిలి, రాముడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు 6 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, వెంటనే జీతం డబ్బులు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంకకు సిబ్బంది వినతిపత్రం అందజేశారు. శానిటేషన్ కార్మికులు, కేర్ టేకర్స్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్ తదితరులకు 6 నెలలు జీతాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే తమకు జీతాలు ఇప్పించకుంటే ఆందోళన చేస్తామని వినతి పత్రంలో పేర్కొన్నారు. దయాకర్, శైలజ, అలివేల, పార్వతమ్మ, బాలీశ్వరమ్మ, నాగమ్మ, వరలక్ష్మి, గణేష్, ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేపడతాం



మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

ఆత్మకూర్: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నేతృత్వంలో మక్తల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యాక్రమాలను చేపడుతున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బాలకిష్టాపూర్, బావుసింగ్‌తండా తదితర గ్రామాలను బీజేపీ నాయకులతో కలిసి సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాలకిష్టాపూర్ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు స్థల పరిశీలన జరిపారు. అలాగే రామన్‌పాడ్ రోడ్డు నిర్మాణం, డ్రైయినేజీలు, సీసీరోడ్లు, ఐమాక్స్ లైట్ల ఏర్పాట్లు తదితర అభివృద్ధి పనులను ఎంపీ నిధులతో చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు మేర్వరాజు, తమ్మలివిజయ్, అశోక్‌భూపాల్, మనోహర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాసన్న, నర్సింహ, ఆంజనేయులు, సుభాష్‌నాయక్ ఉన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: పిల్లల్లో నులిపురుగులను నివారించడం వలన వారు ఆరోగ్యంగా ఎదుగుతారని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై సిబ్బందికి సూచనలు చేశారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థులకు పంపిణీ చేసే మాత్రలను భోజనం చేసిన తర్వాతనే వేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీహెచ్ఓ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ మైథిలీ, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రమాబాయి సేవలు మరువలేనివి



వనపర్తి టౌన్: అంబేడ్కర్ సతీమణి రమాబాయి సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. శుక్రవారం రమాబాయి అంబేడ్కర్ 127వ జయంతిని పురస్కరించుకొని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలోనూ వివక్షత కొనసాగుతుందని, అలాంటిది వివక్షత అడుగడుగున ఉన్న సమయంలోనే అంబేడ్కర్ జ్ఞానశీలిగా ఎదిగేందుకు రమాబాయి తోడ్పాటును అందించారన్నారు. కుటుంబ పోషణ భారమైన, పిల్లలు అనారోగ్య పరిస్థితి దాపురించి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా చదువు ప్రాధాన్యతను గుర్తించి అంబేడ్కర్‌కు వెన్నుతట్టి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయకంటి నర్సింహశర్మ, నాగరాజు, బాలేమియా, వెంకట్‌స్వామి, శివకుమార్, రఘునాథ్‌రెడ్డి, నిదర్శన్‌గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల దోపిడీని అరికట్టాలి'



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్కానింగ్ చేయడానికి డాక్టర్లు నియమించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, పట్టణ కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు స్కానింగ్ సెంటర్ ఉన్నా.. డాక్టర్లు లేకపోవడంతో వారు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వారు ఉదయం 6 గంటల నుంచి ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల వద్ద క్యూలో ఉండి స్కానింగ్ తీయించుకోవాల్సి వస్తుందన్నారు. కొందరు డాక్టర్లు ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తూ.. ప్రైవేట్‌గా క్లినిక్‌లు నడుపుతూ నిబంధనలు అతిక్రమిస్తున్నారని వివరించారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్కానింగ్ డాక్టర్లను నియమించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలస్వామి, గట్టయ్య, బీసన్న, రాబర్ట్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

'దళితుల పక్షపాతి కాంగ్రెస్'

వనపర్తి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పక్షపాతిగా, వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ఎస్సీ వర్గీకరణ చేపడుతుందని కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ డి.వెంకటేశ్ అన్నారు. దళితులు, బీసీల అభ్యున్నతితో పాటుగా రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపడం, రైతు భరోసా తొలివిడ నిధులను రైతుల ఖాతాల్లో జమచేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని దళితవాడలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కంట్రోల్ రాములు, చిట్టెమ్మ, కళావతి, భారతమ్మ, భూమమ్మ, సునీత, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

వనపర్తి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాచాల రష్మికరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహం, ఏ, బీ వసతి గృహాల్లో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వాతావరణం మార్పుల వలన కొన్ని సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు భోజనం తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు ఎస్.ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, వసతి గృహ, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం పనులను శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భూమిపూజ చేశారు. మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, సంస్థానాధీశులు రాజశ్రీరాంభూపాల్ ముఖ్య అతిథులుగా హాజరై పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఇదివరకే అమ్మవారి విగ్రహ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో పూర్వక కలాపకర్షణ, ఉద్యాపన, గణపతిపూజ, హోమం, అభిషేకం తదితర పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పెద్దమ్మతల్లి పునఃప్రతిష్ఠతో ఊరికి మంచి జరుగుతుందని నిర్వాహకులు అన్నారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు అవసరమని, భక్తులు విరాళాలు అందించి సహకరించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, మాజీ చైర్‌పర్సన్ గాయత్రి రవియాదవ్ దంపతులు, గాడి లక్ష్మీనారాయణ, వాస్తుపండితుడు రమాకాంత్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, బాలకృష్ణ, నాగేష్, సుదర్శన్‌శెట్టి, యాదగిరిశెట్టి, రవికుమార్, భక్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు శుక్రవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తరగతి గదిలో ఉంటూ ఉపాధ్యాయులు బోధించిన అంశాలను తెలుసుకుని జ్ఞానాన్ని పెంచుకొంటున్న విద్యార్థులు తామే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రధానోపాధ్యాయురాలిగా తేజశ్రీ, కలెక్టర్‌గా ఆవేజ్, డీఈఓగా జాహేద్, ఎంఈఓగా హరినాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులుగా చక్కటి పాత్రను పోషించారని పాఠశాల జీహెచ్ఎం కృష్ణవేణి తెలిపారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో పదికి పది గ్రేడ్‌లు సాధించాలని సూచించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ పర్వతాలు

గోపాల్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకంగా పరిశీలన జరపాలని ఏదుల మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పర్వతాలు అన్నారు. శుక్రవారం ఆయన ఏదుల మండల కేంద్రంలోని అధికారులు, కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి తారతమ్యాలు లేకుండా స్థలం ఉండి ఇల్లు లేని వారిని గుర్తించి వారికి మొదటి విడతలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మండలంలో ఎంపిక చేసిన ఇళ్లను అధికారులు ఎప్పటికప్పుడు క్రాస్‌చెక్ చేయాలని సూచించారు. ఏదుల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్ నిర్మించేందుకు స్థలం చూపించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. చీర్కపల్లిలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపును క్రాస్ వెరిఫికేషన్ చేశారు. ఆయనతో పాటు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాములు, తహసీల్దార్, కార్యదర్శులు ఉన్నారు.

పరమేశ్వరస్వామి జాతరకు ఏర్పాట్లు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్, నిర్వాహకులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరకు సంబంధించి మార్చి 1, 2, 3 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరుమహోత్సవం కనులపండుగగా జరుగనుంది. శుక్రవారం ఆలయ చైర్మన్ వెంకటనర్సింహారావు, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి, ప్రధాన కార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి తెలుగు నాగేష్, కమిషనర్ శశిధర్ ఆధ్వర్యంలో ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ చేపట్టబోయే ఏర్పాట్ల గురించి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. 1560వ సంవత్సరంలో ఆలయంలో లింగాన్ని ప్రతిష్ఠించారని, అప్పటి నుంచి మహాశివరాత్రి సందర్భంగా అమావాస్య అనంతరం జాతరను చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

గుడిసెల పోరుకు సన్నద్ధం



అమరచింత దుంపాయికుంటలో గుడిసెల పోరు లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అమరచింత: పట్టణంలోని నిరుపేదలు ఇంటి స్థలాల హద్దులు చూపాలంటూ రెండున్నరేళ్లుగా గుడిసెలు వేసుకుని ఆందోళన చేస్తున్న పాలకులు పట్టించుకోకపోవడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. మండల కేంద్రంలోని బస్టాండ్ రహదారి పక్కన శనివారం నుంచి రిలేదీక్షలు చేపట్టి తమ ఆందోళన కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. సర్వేనంబర్ 567లోని దుంపాయికుంటలో గల 14 ఎకరాల పొలంలో ఇంటి స్థలాల కోసం కొనుగోలు చేసి 25 ఏళ్ల క్రితం అర్హులైన 400 నిరుపేదలకు ఇంటి పట్టాలను అందించారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు వచ్చినా.. స్థలాలు చూపకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు స్వరాష్ట్రం సిద్ధించినప్పటికీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేకపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా తమకు ఇంటి స్థలాల విషయంలో డబుల్ ఇళ్లు అంటూ ఆశ చూపి నట్టేట ముంచిందని వాపోతున్నారు. దీంతో తమకు ఇంటి స్థలం చూపాలనే డిమాండ్‌తో సీపీఎం మద్దతులో 2022 సంవత్సరం నుంచి దుంపాయికుంటలో గుడిసెలు వేసుకుని తమ పోరాటం కొనసాగిస్తున్నారు.

రెండు రోజుల రిలే దీక్షలు



గుడిసెల పోరు లబ్ధిదారులకు న్యాయం జరగాలని కోరుతూ వారికి మద్దతుగా శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు రిలేదీక్షలు నిర్వహిస్తున్నాం. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి నిర్వహించి సమస్య పరిష్కారం అయ్యేవరకు కదలకుండా ఆందోళన కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

– జీఎస్ గోపి, సీపీఎం మండల కార్యదర్శి

కొత్త ప్రభుత్వం కొలువుదీరినా..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా తమ సమస్య పరిష్కరించడం లేదని గుడిసెల పోరు బాధితులు రిలేదీక్షలకు సిద్ధమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి పలుమార్లు తమ గోడు విన్నవించినా.. ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'విద్యార్థుల జీవితాన్ని ప్రభావితం చేయాలి'

వనపర్తి విద్యావిభాగం: విద్యార్థుల జీవితాన్ని ప్రభావితం చేసేలా బోధిస్తేనే ఉత్తమ ఉపాధ్యాయుడు అన్న పదానికి సార్థకత చేకూరుతుందని సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, తెలుగుభాష సంరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.నారాయణ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుడిగా, గాయకుడిగా రాణిస్తున్న రామాకాంత్ ఇటీవల పదవీ విరమణ కావడంతో సాహితి కళావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రేడియంట్ స్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలందిస్తూ వృత్తి ధర్మాన్ని మరువకుండా ప్రవృత్తితో ప్రముఖ గాయకుడిగా వనపర్తికే వన్నె తెచ్చేలా రమాకాంత్ పేరు గడించారని కొనియాడారు. కవి జనజ్వాల, సాహితి కళావేదిక ప్రతినిధులు నాగరాజు, రాములుయాదవ్, సత్తార్, ఎస్.చంద్రశేఖర్, బండారు శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎగ్జామ్ కమిషనర్ గణేష్, నందిమల్ల రాములు, చంద్రశేఖర్, బాలస్వామి, మద్దిలేటి ఉన్నారు.